# అమ్మా నన్నెత్తుకో

'పట్టరాని' సంతోషంతో ఇంట్లో అడుగు పెట్టింది దివ్య. తనీ రోజు మహిళాదినోత్సవం వేడుకల్లో ఎంత చక్కని ఉపన్యాసం ఇచ్చింది. తన వాగ్ధాటికీ, భావనా చాతుర్యానికి అంతా ముగ్ధులైపోయారు. చప్పట్లమోత ఆగితేనా! ఇలానే తన శక్తిని పెంచుకుంటూ వెళ్ళితే. గొప్ప ఉపన్యాసకురాలై తీరుతుంది. అభినవ సరోజినిదేవిగా వెలిగిపోదూ! ఆమె ఉత్సాహాన్ని నీరు గార్చేశాడు దీపక్.

"నాన్నగారి దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది" దివ్యా. అతనితో ఆనందాన్ని పంచుకుందా మనుకున్న మూడ్ కాస్త చెదరగొట్టేశాడు దీపక్.

" ఛ! ఛ ఎప్పుడూ మీకు ఫామ్లీ ఎఫైర్సే!" "ప్రోగ్రామ్ సక్సెస్ చేశావా, ఆడియన్స్ రెస్పాన్స్ ఎలా వుంది? నేషనల్ ఇంటర్నేషనల్ లెవెల్లో నేమ్ అండ్ ఫేమ్ తెచ్చుకోవాలి. అనవలసింది పోయి, ముఖం ముడుచుకుంది.

అది కాదోయ్! ముఖ్యంగా రాసిందేమిటంటే, ఏదో ఒకటి ! పెద్ద వయస్సులో తోడు లేకుండా ఎలా వుంటాం? మీ దగ్గరకు వచ్చేస్తాం అనో... సవాలక్ష కారణాలు వ్రాస్తూ... డబ్బు పంపమనో... అయితే మాత్రం మనవల్ల కాదని వెంటనే వ్రాసి పడేయండి. నాకు ఇంట్లోనే ఉండడానికి చాకిరి చేసి వాళ్ళని సంతృప్తి పరచడానికి కుదరదు. ఇక డబ్బంటారా ! ఈ నెల్లో మనకి చాలా ఖర్చు లున్నాయి. మా మహిళామండలి సభ్యుల టూర్ ఒకటి వుంది. చాలా ఫంక్షన్స్ వున్నాయి. అన్నింటికి పెద్ద మొత్తమే ఖర్చవుతుంది. అలాంటప్పుడు ఇక మొహమాటపడడం అనవసరం. అందుకే ఖచ్చితంగా వ్రాసేయమంటున్నాను.

ఉత్తరంలో ఏముందో చూసుకోకుండా ఊహాగానాలు చేసేయడమేనా? అనుకుంటూ " ఈ విషయాలు అమ్మానాన్నకి తెలుసు దివ్యా! అసలు వాళ్ళదేం రాస్తేగా! నాన్న ఏం వ్రాశారంటే." మళ్ళీ చెప్పబోయాడు.

"అమ్మ వచ్చేసింది" పరుగెత్తి దివ్యను వాటేసుకోబోయిందల్లా ఆమె కోపంగా చూసేసరికి దూరంగా జరిగింది రోజి. రోజీ! నీకెన్ని సార్లు చెప్పానే ! గుమ్మంలో అడుగుపెట్టగానే మీద పడొద్దని ! అన్నం తిన్న చేతులైనా కనుక్కోకుండా, ఛ, ఛ ఏమిటది?" పసుపురంగు చీరమీద మెరూన్ కలర్ బోర్డర్ వున్న తన చీరను అపురూపంగా చూసుకుంటూ, పాపాయిని వారించింది.

"మల్లికా! దీన్ని తీసుకెళ్లి రైమ్స్ చదివించు. చూడూ ! హోంవర్క్ కంప్లీట్ చేయించు !" చిరాగ్గా అంది. " భలే దానివే ! దానికేం చేతనవుతుంది. ఓ గంట ముందుగా రాగలిగాను. గనుక నేనే ఇప్పటి దాకా చదివించా! కాసేపు మనిద్దరితో కబుర్లు చెప్పి, ఆడుకోవాలని పాప పరిగెత్తుకుంటూ వస్తే, చదువు చట్టబండలంటావా?"

" దానితో ఇప్పుడాటలేవిటి? ప్రొద్దునించి సభ ఏర్పాట్లు చూడడంతో నిస్సత్తువ వచ్చేసింది. మనం కూడా తొందరగా భోజనాలు కానిస్తే. కాస్త విశ్రాంతి దొరుకుతుంది" అంటూ డైనింగ్ హాల్‌కి దారితీసింది. బిత్తరచూపులు చూస్తున్న రోజీని ఎత్తుకొని నిద్రపుచ్చే ప్రయత్నంలో పడింది మల్లిక.

నిద్రకుపక్రమించి కూడా.. మావగారి ఉత్తరంలో ఏముంది అని అడగలేదు దివ్య. ఉత్తరంలో సారాంశం భర్త నోట విన్నప్పుడు మాత్రం రవ్వంత కంపించింది.

"మామయ్య గారన్నట్లు ఆ రెండేళ్ళు ఆ రోజును మనం పట్టించుకోనే లేదు. ఒక యేడు ఢిల్లీలో నేషనల్ ఉమెన్స్ కాన్ఫరెన్స్‌కి, అంతకు ముందు మహారాష్ట్రలో టెన్నిస్ కాంపిటేషన్స్‌కి, ఇలా మిస్సవుతూ వస్తోంది. నేను ఉండడమే కుదరడం లేదు" అంది.

అనడమైతే అంది గాని... తన పాప పుట్టిన రోజు ముఖ్యమైనదిగా అనుకుంటే తను వెళ్ళకుండా ఉండగలిగేదే ! మొదటి రెండేళ్ళ రోజి పుట్టిన రోజులు తన ప్రమేయం లేకుండానే జరుగలేదూ? ఏడాది పుట్టినరోజు ఎంతో సంబరంగా ముత్తయిదువుల సందడితో పేరంటం చేసి మురిసిపోయింది అత్తగారు. రెండో ఏడు తమ ఇంటికే అంతా వచ్చారు. నాకు వాయనాలు ఇవ్వడం, అక్షింతలు వేయించడం హారతులూ, దీవెనలూ, ఇలాంటివి బోర్ అని తెగేసి చెప్తే... ఆధునిక పద్ధతిలో రోజి చేత కేక్ కట్‌చేయించి, గ్రాండ్‌గా పార్టీ ఇచ్చి... పెద్దవాళ్ళే ఒక మెట్టు దిగి బ్రహ్మాండంగా చేశారు.

కన్నబిడ్డ పుట్టిన రోజులన్నీ మనస్సులో తిరిగాయి.

' ఓ వారం టైంవుందిగా! రోజీకి గుర్తుండి పోయేలా, దాని పుట్టిన రోజు తనే చేయాలి. రోజీకి ఏం బహుమతి కావాలో అడగాలి. అది ఎంత ఖరీదైనది అయినా... దానికిచ్చి తీరాలి" అనుకుంటూ నిద్రలోకి జారిపోయింది.

రోజీని స్కూల్‌నుంచి తీసుకొచ్చి, స్నానం చేయించి డ్రస్ మార్చి, దానికిష్టమైన గులాబ్‌జాం తినిపిస్తోంది మల్లిక.

ఎల్లుండే రోజీ పుట్టినరోజు. దానికేం కావాలో అడగనే లేదు. తను మరీ బిజీ అయిపోయింది. అందుకే ఈవేళ లేడీస్ క్లబ్‌కి వెళ్ళదలచుకోలేదు. సరాసరి ఆఫీస్ నుండీ ఇంటికే వచ్చేసింది.

రోజీ తల్లిని చూసినా దగ్గరకు వెళ్లలేదు. ఆత్రంగా 'అమ్మా' అని అరుస్తూ గంతులు వేయనూ లేదు. ఉదాసీనంగా ఉండి పోయింది.

"పాపా ! ఇంకా తినవూ ! తినేయ్ రెండే వున్నాయ్!" స్పూన్‌తో నోటికి అందివ్వబోయింది! మల్లిక మూతిబిగించి తల అడ్డంగా ఊపి... తన గదిలోకి వెళ్ళిపోయింది. పాపాయి స్థితి అర్థంకాని దివ్య తనూ వెనకే వెళ్ళింది.

బిగుసుకు కూర్చున్న రోజీ, తల్లి స్పర్శకి తుళ్ళిపడింది. "ఏమా ! నిన్ను కొట్టిందా మల్లికా !" తల్లి ప్రశ్నకు తల అడ్డంగా ఊపింది. " మరేం తినకుండా వచ్చేశావు ? మల్లిక చెప్పినట్లు వినాలి"

"నేను ఎప్పుడూ మల్లిక మాట వింటాను, అది చాలా మంచిది."

"అయితే మరెందుకు తినలేదు ?"

బదులు చెప్పలేదు రోజీ !

"పోనీలే ! ఎల్లుండే నీ పుట్టిన రోజు. నీకేం బహుమతి కావాలి?"

"నాకేమి అక్కర్లేదు "

"అలా కాదమ్మా! పుట్టిన రోజుకి నీకు మంచి బహుమతులిస్తాను. నీకెలాంటి ఫ్రాక్ కావాలి? ఏం బొమ్మలు కావాలి ? గోల్డు రింగు కావాలా? చైన్ కావాలా? చెప్పు చిట్టితల్లి. నీవేమడిగినా ఇప్పుడే బజారుకెళ్లి తెచ్చేసుకుందాం."

"నాకేవీ అక్కర్లేదు. చెప్పాగా"

"పోనీ నీకేం కావాలమ్మా" లాలనగా అంది. అప్రయత్నంగా చేతులు ముందుకు చాచింది. రోజీ తల్లిపైకి ఉరకలేదు. తన మనస్సులో కోరిక చెప్పింది. అంతే... దివ్య షాక్ తింది.

'అవును! తను ఇన్నేళ్ళుగా... ఎంత నిర్లక్ష్యం చేసింది. పురిటి మంచం దిగాక దాన్ని లాలనగా ఎత్తుకున్నదెప్పుడు? ప్రేమగా హృదయానికి ఎప్పుడు హత్తుకుంది గనుక! ఆ లేత మనసులో ఎంతకాలంగా ఈ తపన కరుడుగట్టుకు పోయింది గమనించని మూర్ఖురాలై పోయింది తను. తనలోని మాతృత్వపు మమకారం ఏమైపోయినట్టు?'

నాగరికతా వ్యామోహంలోపడి, కొట్టుమిట్టాడుతూ, దాన్ని పనివాళ్ళ చేతుల్లోనే పెరగనిస్తోంది. అందుకే తన బంగారు తల్లి అలా అంది.

నువ్వూ, నాన్నారు ఇవన్నీ తెస్తూనే ఉన్నారు. అవేం నాకు బహుమతులు కావు.

"అమ్మా! ఒక్కసారి నన్నెత్తుకో!" నాకు అదే మంచి బహుమతి, పాలు తాగించి, అన్నం తినిపించి, నాతో ఆడుకో, ఒళ్ళో పడుకో పెట్టుకొని, కథలు చెప్పు - అమ్మలందరూ ఇలానే చేస్తారని మా ఫ్రండ్స్ చెప్తున్నారు. నువ్వు అలా చేయవూ !

ఆ పసిదాని మాటలతో తను విస్మరించిన బాధ్యత గుర్తించిన దివ్య అమాంతం బిడ్డని కౌగిలించుకుంది. ముద్దులతో ముంచెత్తింది.

రోజీ మనసులో 'అమ్మ' అనురాగా మృతం కురిసింది. తన లేతచేతులతో తల్లిని చుట్టేసి గిలిగింతలు పెడుతూ కిలాకిలా నవ్వింది.

*జూన్ 2001 ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక* ❑